

# డ్రెస్ రిహార్సల్స్

డాక్టర్ నక్కా విజయ రామరాజు

నేనా మెడికల్ కాలేజీకి చేరేసరికి– అక్కడంతా వచ్చిపోయే వ్యాన్లు, లారీలు, ఆటోలు, వాటిలో నుంచి దిగుతున్న జనాలతో తిరణాలు తిరణాలుగా ఉంది. జనమంతా గోలగోలగా మాట్లాడేసుకుంటున్నారు.

అక్కడ బాపు కార్టూన్‌ల్లో పక్కింటి పిన్నిగారి లాంటి బలిష్టమైన ఆడమనిషి హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ... ఎవరేం చేయాలి, ఎవరెక్కడ నిలబడాలి, ఎవరెక్కడ కూర్చోవాలి, ఎవరెప్పుడు నోరు తెరవాలో అక్కడున్న స్టాఫ్‌కి ఆర్డర్లిస్తోంది. బక్కపలుచగా, పొట్టిగా ఉన్న ఒకతను ఆమె పక్కనే బిజీగా తిరుగుతూ మధ్యమధ్యలో ఆమె చెవిలో ఏదో చెబుతున్నాడు. అతనే ఆమె పి.ఎ. పి.కె. రావు. లారీల్లోంచి ఇంకా జనం దిగుతూనే ఉన్నారు. కొంతమంది మనుషులు పోర్టికోకి రంగులేస్తోంటే... ఇంకొంతమంది తాపీమేస్త్రీలు హాస్పిటల్ గోడలకి ప్లాస్టరింగ్ చేస్తున్నారు... ఇంకొందరు పూల కుండీలు పోర్టికోలో సర్దుతున్నారు.

''ఇంతాలస్యమైతే ఎట్లా డాక్టర్..? వాళ్ళొచ్చే టైమయింది. పొద్దున్నే రమ్మన్నాంగా..చెప్పలే?'' అంటూ పక్కనున్న పి.ఎ. వైపు చూసింది. ఆ పెద్ద మేడమ్ మెడకల్ కాలేజీకి ఆఫీసు సూపరిండెంట్ కమ్ కరరస్పాండెంట్ కమ్ ఆల్ ఇన్ వన్.

''యాప్రాన్(డాక్టర్లు వేసుకొనే తెల్లకోటు) కోసం వెతుకుతుంటే ఆలస్యమైంది మేడమ్'' అంటూ సంకలోనుంచి మడతపెట్టిన యాప్రాన్‌ను తీసి వేసుకున్నాను. రిన్ సోపుతో ఉతికి పెట్టెలో దాచిన యాప్రాన్ మల్లెపువ్వులా మెరిసిపోతోంది. పిల్లల చొక్కా పెద్దోళ్ళు వేసుకున్నట్లు యమ టైట్‌గా ఉందది. నా బొజ్జ ముందుకు పొడుచుకొచ్చింది. టప్.. టప్.. మని రెండు బొత్తాలు కూడా తెగిపోయినయ్.

''ఎలా ఉంది నా కోటు'' అన్నట్టు మేడమ్ వైపు చూశా నవ్వుతూ.

''ఏందది? మీరిప్పుడు పొడుగు చేతుల యాప్రాన్ వేసుకోవాల! ఈ హాస్పిటల్ సూపరింటెంట్ మీరే'' అంది.

''ఓహో సీనియర్‌నయ్యానని నాకు ప్రమోషనిచ్చారా! థ్యాంక్యూ వెరీమచ్'' అంటూ ఆమె వంక చూస్తూ నవ్వాను.

''సీనియర్ కాదు...గాడిద గుడ్డూ కాదు...! ఈ రోజు సూపరిండెంట్‌గా రావాల్సిన డాక్టర్ పుల్లయ్యను కొత్తగా పెట్టిన గెద్దలపాడు మెడికల్ కాలేజీ వాళ్ళు తన్నుకుపోయారు! అక్కడ ఇన్‌స్పెక్షన్ రేపు'' అంటూ నాకొక అటెండర్‌ను కూడా ఇచ్చింది. అతను ఫుల్‌సఫారీలో, బాటా షూస్‌తో నాకంటే టిప్‌టాప్‌గా ఉన్నాడు.

''మన మెడికల్ కాలేజీకి ఇన్‌స్పెక్షన్ కోసం వచ్చే ఎం.సి.ఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) బృందాన్ని మీరే రిసీవ్ చేసుకొని వారికి ఓ.పి గదులు, వార్డులు, ఆపరేషన్ గదులు, క్లాస్‌రూమ్‌లు చూపించాలి. మిగతా డాక్టర్లను పరిచయం చేయాలి'' అని పొడుగు చేతుల యాప్రాన్ ఇచ్చింది. అది నన్ను మింగేసింది. చిన్నప్పుడు మానాన్న చొక్కా వేసుకున్నట్లుందది. నా యాప్రాను అటెండర్‌కు ఇచ్చాను.

అప్పుడే వచ్చిన వ్యాన్‌లో నుంచి కొంతమంది అమ్మాయిలు కిలకిలా నవ్వుకుంటూ దిగారు. వారిలో కొంచెం బొద్దుగా ఉన్న పిల్లలకి 'హెడ్ నర్సు' లని చాటల్లాంటి క్యాప్‌లు ఇచ్చి...సన్నగా ఉన్న పిల్లలను స్టాఫ్ నర్సులని, అందరికీ బ్యాడ్జీలు ఇచ్చింది. నేను వారిని చూస్తుండగా రెండు స్కూల్ వ్యాన్లు వచ్చి ఆగినయ్. అందులోంచి బిలబిలమంటూ కోడిపిల్లల్లా స్కూల్‌పిల్లలు దిగారు. చక్కటి యూనిఫాం, షూస్, టైలతో ముచ్చటగా ఉన్నారు.

'వీరితో ఇన్స్‌పెక్షన్ కోసం వచ్చేవారికి పూలమాలలు వేసి, పూలగుత్తులు ఇప్పించి వెల్‌కమ్ డ్యాన్స్ లూగట్రా చేయిస్తారేమో?' అనుకున్నాను.

''స్కూల్‌పిల్లలను తీసుకొచ్చావేమయ్యా...? చిన్నపిల్లల ఓ.పి.కి, వార్డులకి పిల్లలను తీసుకురమ్మంటే?'' అంది మేడమ్ కోపంగా, పిల్లల్ని తీసుకువచ్చిన మనిషి వంకచూస్తూ.

''చిన్నపిల్లల్ని ఎవరూ పంపమన్నారు మేడమ్. పోయినసారి వచ్చినప్పుడు చాలా ఇబ్బంది పడ్డాం! అందుకే గీతాంజలి స్కూల్ హెడ్మాస్టర్ చేయి తడిపి స్కూల్ వదిలేలోగా తీసుకొస్తానని చెప్పి తెచ్చా. మూడు గంటలకల్లా వదిలేయాలి. లేకపోతే వాళ్ళతో నాకు మాటొస్తది'' అంటూ తోలుసంచిలోంచి పిల్లల వివరాలున్న కాగితం తీసి చూపించాడు.

మేడమ్ సెల్‌లో నుంచి 'కలవరమాయే మదిలో..' అనే రింగ్‌టోన్ వినబడింది. అట్నుంచి ఫోన్‌లో ''అర్ధగంటలో ఇన్స్‌పెక్షన్ టీమ్ అక్కడుంటుంది మేడమ్'' అనే వాయిస్ వినిపించింది.

''ఇంకో గంట ఆలస్యంగా తీసుకురండి. ఇక్కడ ఇంకా జనం అదేనయ్యా..పేషెంట్లు, డాక్టర్లు రాలేదు. ఈలోపు ఆ ఇన్‌స్పెక్షన్ టీమ్‌ని స్తంభాల చెరువు గట్టుకో, ఆ పాడుబడ్డ గుడికో తీసుకెళ్ళి సుందర దృశ్యాలని, పిల్గ్రిమేజ్ సెంటరని, చాలా ఓల్డ్ టెంపులని ఏదోలాగా ఒక గంట మేనేజ్ చెయ్. ఇక్కడ పని పూర్తికాగానే రింగిస్తా'' అని చెప్పింది మేడమ్.

''గంటలో అంతా రెడీగా ఉండాలి.... ఇన్‌స్పెక్షన్ టీమ్ గోరిగపూడి దాకా వచ్చేసింది. ఓ.పి. నుంచి వార్డు దాకా... ఆపరేషన్ గది నుంచి లేబర్ రూమ్ దాకా'' అంది మేడమ్.


''ఒక్క రోజు ఉండిపోయే లేబర్‌కి సెపరేటు రూమెందుకు మేడమ్?'' అన్నాడు నా పక్కనున్న అటెండర్.

''హాస్పిటల్‌లో లేబర్ రూమంటే కాన్పుల గది'' అని అతన్ని పక్కకిలాగి ప్రైవేట్ చెప్పా. వ్యానుల్లోంచి దిగుతున్న మనుషుల్ని లెక్కేసుకుంటూ. ''దీంతో ఐదు వందల యాభై'' అన్నాడు నాతో.

''లెక్క మేడమ్‌తో చెప్పవయ్యా..నాతో కాదు. నేను ఈ హాస్పిటల్ సూపరింటెండెంట్‌ని'' అన్నాను దర్పంగా. మేడమ్ పోర్టికోలో రంగులేస్తోన్న లేబర్ దగ్గరకెళ్ళింది. మనుషులను సప్లయ్ చేసే మనిషి నా పక్కనే నిల్చొని ఆ రోజు మొత్తం ఎంతమందిని తీసుకున్నాడో కాగితం మీద లెక్కేసుకుంటున్నాడు.

''ఈ పనికాక ఇంకేం చేస్తావేంటి?'' అన్నాను అతనితో మాట కలుపుతూ.

''ఇంతకుముందు పొలిటికల్ పార్టీల మీటింగ్‌లకు మనుషుల సప్లయ్ వ్యాపారం చేసేవాడినండి. మనుషులు లెక్క కాకుండా లారీ లోడ్‌కు ఇంతని



ఇచ్చేవాళ్ళు. పై ఊళ్లకు తీసుకెళ్తే వేరే రేటు. రాను, పోను బత్తా కూడా గిట్టేది. దీంట్లో కూడా కాంపిటేషన్ ఎక్కువైపోయింది. ఈ మధ్యన మహారాస్త్రాకోలని, రోడ్డు షోలకని జనాలని ఏ పార్టీవాళ్ళు ఆ పార్టీ వారే తీసుకెళ్తున్నారు. ఇప్పుడల్లా ప్రైవేటు మెడికల్ కాలేజీలకు ఇన్‌స్పెక్షన్‌లప్పుడు పేషెంట్లు కావాల్సి వచ్చినప్పుడే పనితగుల్తుంది. డీజిల్ రేట్లు, లారీ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావడం లేదు. మీ ఎరికలో ఇంకెక్కడన్నా మెడికల్ కాలేజీ ఇన్‌స్పెక్షన్ ఉంటే చెప్పండి సార్.. ఎంతమంది జనం కావాలన్నా సప్లైచేస్తా'' అన్నాడు ఆ కాంట్రాక్టర్.

మేడమ్ మా దగ్గరికి వచ్చి ''సెలైన్‌స్టాండ్‌లా ఇంకా ఇక్కడే నిలబడ్డారే! పోయి వార్డులు, ఓ.పి.లు చూసుకోండి'' అని కసిరింది నన్ను.

ఓసారి హాస్పిటల్‌నంతా చూసినట్టుంటుందనుకొని బయలుదేరబోతుండగా డజను మంది డాక్టర్లు యాప్రాన్‌లు వేసుకొని నా దగ్గరకి వచ్చారు. వీళ్ళను ఎప్పుడూ చూడలేదు. మా చుట్టుపక్కల ఊళ్ళలో నాకు తెలియని డాక్టర్లు ఎవరూ లేరు. మరి వీళ్ళంతా ఎక్కడి నుంచి వచ్చారో అర్థంకాక ''మీదే డిపార్ట్‌మెంట్ డాక్టర్'' అని అందులో కొంచెం బట్టతల ఉన్న పెద్దమనిషిని అడిగా.

''హిస్టరీ'' అన్నాడు.

అర్థకాక ''అంటే?'' అన్నట్టు ఆయన వంకే చూశాను.

''గవర్నమెంట్ కాలేజీలో హిస్టరీ హెడ్డునండి.. నా పేరు రావు. ఇతను బోసు...బోటని, ఇతను రాజు... జువాలజీ, ఇతను సుభాష్'' అంటూ మిగిలినవారిని పరిచయం చేశాడు.

''మీరంతా నాన్‌మెడికలా?'' అన్నాను ఆశ్చర్యంగా.

''మెడికల్ కాలేజీ ఇన్‌స్పెక్షన్ కోసం ఢిల్లీ నుంచి ఏదో మెడికల్ టీమ్ వస్తోందంటగా ఓ రెండు గంటలు ఈ తెల్లకోట్లు వేసుకొని డాక్టర్లుగా ఉంటే 500 ఇస్తానని మేడమ్ గారు పిలిస్తే వచ్చాము సార్'' అని ''మీరే కాలేజీ...బోటనీనా, జువాలజీయా? మీకెంతిస్తానన్నారు?'' అన్నాడు నన్ను.

నాకు చిర్రెత్తుకొచ్చింది. ''నేను మీకులాగా నాన్‌మెడికల్ కాదండి... నిజంగా ఎంబిబిఎస్ చదివిన డాక్టర్‌ని. ఇప్పుడు ఈ హాస్పిటల్‌కి సూపరిండెంట్‌ని'' అన్నాను.

వారిలో సన్నగా పొడుగ్గా ఉన్న అతను నా దగ్గరికి వచ్చి ''సార్! ఇప్పుడు నన్ను స్కిన్ స్పెషలిస్టు అంటారేంటి? పోయినసారి వచ్చినప్పుడు కంటి డాక్టర్‌గా ఉన్నానుగా'' అంటూ డిగ్రీ కాలేజీ నుంచొచ్చిన తెలుగు లెక్చరర్ అన్నాడు.

''ఆ పనికి వేరే అతను వచ్చాడు. మీరు ప్రస్తుతానికి డెర్మటాలజిస్టు అంటే స్కిన్ స్పెషలిస్టు అనగా చర్మవ్యాధి నిపుణులన్నమాట!'' అన్నాను.

''నేను చర్మవ్యాధి నిపుణున్ని కదా! సపోజ్... గజ్జి, తామరకు, సెగగెడ్డకు ట్రీట్‌మెంట్ ఏమిస్తారని వాళ్లడిగితే జాలిమ్‌లోషన్, ఇచ్‌గార్డు రాసి ప్లాస్టర్ వేస్తాను అని చెబితే బాగుంటుందా?'' అన్నాడు అతితెలివిగా.

''నోరు మూసుకుంటే ఇంకా బాగుంటుంది. మీ జనరల్ నాలెడ్జితో వారికి పనిలేదు. ఉత్సవ విగ్రహంలా నిలబడితే చాలు'' అన్నాను కోపంగా.

కేటాయించిన గదికి అతను వెళ్ళిపోయాడు.

''డిగ్రీ కాలేజీ లెక్చరర్లని తీసుకొచ్చి డాక్టర్ల వేషం వేయించింది. మరీ ఇంత కక్కుర్తా మీ మేడమ్‌కి?'' పక్కనున్న అటెండర్‌తో అన్నాను.

''పోయిన ఏడాది ఎం.సి.ఐ. ఇన్‌స్పెక్షన్ టైమ్‌లో వచ్చిన డాక్టర్లకి సరిగ్గా డబ్బివ్వలేదండి అందుకే ఈరోజు ఏ డాక్టరూ రానన్నాడు, అందుకే ఈ సెటప్ చేసింది మేడమ్'' అన్నాడు అటెండర్.

చేతులు వెనక్కి పెట్టుకొని నడుస్తూ... సూపరిండెంట్ అన్న దర్పంతో ముందుగా గైనిక్ వార్డుకెళ్ళాను నా అటెండర్‌తో కలిసి.

అక్కడున్న స్టాఫ్‌నర్సు నన్ను చూసి ''వందనాలయ్యా వందనాలు'' అంది.

నాకు డౌట్ వచ్చి ''ఎవరు మీరు?'' అన్నాను.

''టాప్ నర్సు..టాప్ నర్సు'' అంది. అర్థంగాక


With Best Compliments From

A.S.R. TRANSPORT

Fleet Owners & Transport Contractors

S&S Plaza, First Floor, Flat No. 103, Sri Krishna Nagar,
Jubilee Hills Road, Hyderabad - 500 045.
Tel: (O) 040 - 23541205 Fax: 23541875
B.O: Vijayawada. Tel: (0866) 2451499
B.O: Coimbattore. Tel: (0422) 2252674
H.O: 37/120, Behind Indira Gandhi Co-op. Hospital,
Kadavanthra, Ernakulam - 682020
Ph: (0484) 2206920, 2206114. Fax: 2205159

పక్కనున్న అటెండర్ వంక చూశాను.

"గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేసే ఆయా బాలమ్మ సార్. నర్సుగా పనికొస్తుందని తీసు కొచ్చా" అన్నాడు. అక్కడ హాలు మధ్యలో ఒకతను ఫోటోలు తీస్తున్నాడు. మెడలో స్టెతస్కోప్, యాప్రాన్ వేసుకున్న డాక్టర్ నవ్వుతూ ఫోజులి స్తోంది.

"ఎవరూ? మీడియావాళ్ళా..? జెమినీనా, టి.వి.9, ఈ.టి.వా? ఏ టీవైనా నాకనవసరం. ఏ పేపరు? ఏదైనా సరే నాట్ ఎలౌడ్... బయటికి పోండి?" అన్నాను కోపంగా.

"ఇక్కడ జరిగేదంతా ఫోటోలు తీసి ఇన్‌స్పెక్షన్ అంతా బోగస్, పేషెంట్లు బోగస్, డాక్టర్లు బోగస్...కిరాయి డాక్టర్లూ..కిరాయి పేషెంట్లు.. అని పేపర్ల నిండా ఇష్టమొచ్చినట్టు రాసి, టీ.వీల్లో చూపించేసి మా మెడికల్ కాలేజీకి పర్మిషన్ రాకుండా చేద్దామనేగా? నో..నో..నో... వీళ్ళేదు ప్లీజ్ గెట్ లాస్ట్" అన్నాను కోపంగా. కెమెరాని సంచిలో సర్దుకున్నాడు కెమెరామెన్.

నేను ఫోటోగ్రాఫర్‌ను తిడుతుండగా..యా ప్రాను జేబులో చెయ్యిపెట్టి స్టెతస్కోప్ ఊపు కుంటూ నా దగ్గరకొచ్చింది డాక్టర్ నవ్వుతూ.

"నేను డాక్టరు గారూ! గుర్తుపట్టలే...మీతో పాటు పెంటపాడు పి.హెచ్.సి.లో పన్జేసిన విమల సిస్టర్‌ని. పోయిన ఏడాదే రిటైరయ్యా, ఫించిని కూడా వస్తోంది. మేడమ్‌గార్రమ్మంటే...అందు లోనూ గైనిక్ డాక్టర్‌గా అంటే వ చ్చా. గుర్తుగా ఉంటుందని తెల్లకోటు, స్టెతస్కోప్‌తో పుటోలు తీయించుకుంటున్నా. అతను మా వీధిలో అబ్బాయే... టీ.వీ. వాళ్ళు కాదు తిట్టకండి" అంటూ "ఎప్పటినుంచి పనిచేస్తున్నారేంటి ఇక్కడ? హబ్బో సూపరిండెంట్ కూడా అయ్యారే!" అంది నా వంక చూసి ఆశ్చర్యపోతూ.

"నీకులాగే నేను కూడా! ష్! అరవకు" అన్నాను డాక్టర్ వేషంలో ఉన్న స్టాఫ్‌నర్సు విమల సిస్టర్‌తో మెల్లగా.

"ఇదిగో జాఫరూ! కింద పదో నెంబర్ గది ఓ.పి.లో శకుంతలక్క ఉందిగానీ.. అక్కడ కూడా రెండు పుటోలు తియ్యి-డబ్బులునేనిత్తాలే" అంది డాక్టర్ వేషంలో ఉన్న విమల సిస్టర్ కెమెరామెన్‌తో.

"నాక్కూడా ఓ పుటో కొట్టించండి సిస్టరమ్మ" అంది స్టాఫ్ నర్సు వేషంలో ఉన్న బాలమ్మ.

"ఓ.పి.లో కూడా స్టాఫ్‌నర్సుల్ని డాక్టర్లుగా పెట్టిందా...మరీ ఇంత ఘోరమా? గుండెలు తీసిన బంటులా ఉందే? ఈ పెద్దమేడమ్" అంటూ పళ్ళు నూరాను పక్కనున్న అటెండర్ వంక చూస్తూ.

అంతలో ఒక మనిషి తూలుతూ వార్డు మధ్య లోకొచ్చి ఏదో వెదుకుతున్నాడు.

"ఎవర్నువ్వు? ఏం కావాలి?" అనడిగా.

"ఎనెటిట్టు...ఎనెటిట్టునండి..పిరిట్‌కావాలి" అన్నాడు ముద్దముద్దగా. అర్థంగాక విమల సిస్టర్ వైపు చూసి "సిస్టర్...ఓ సారీ! డాక్టర్ ఎవరితను?" అనడిగా.

"గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేసే వార్డు బాయ్ జాలయ్య సార్! ఎప్పుడూ తాగి శవాల గది దగ్గర ఉంటాడు. ఈ మెడికల్ కాలేజీకి కావాల్సిన గుండెలు, కిడ్నీలు, మెదడు, శవాల్ని సప్లయ్ చేసేది ఈడే. ఎప్పుడూ మత్తులో ఉంటాడని మత్తు డాక్ట ర్‌గా ఉండమన్నారు మేడమ్" చెప్పింది బాలమ్మ నవ్వుతూ.

"ఎనెటిట్టంటే...ఎనస్థిట్టా? వెరీ గుడ్ పాత్రోచి తంగా చాలా బాగుంది. ఇప్పటికే ఎనస్థిషియా బాగా ఎక్కినట్టుందే.. డాక్టర్ మీరు ఆపరేషన్ గది దగ్గరుండాలి ఇక్కడేం పని?" అన్నాను తూలిపడ బోతున్న అతన్ని పట్టుకుంటూ.

"స్పిరిట్ తాగడాకొచ్చినట్టున్నాడు దొంగసచ్చి నోడు" అంది బాలమ్మ. ఒక స్పిరిట్ బాటిల్ తీసు కొని "ఆపరేషన్ గది తెరిషి లేదు.. ఏమి షేయా లండి. ఈ హాస్పిటల్లో ఏదీ షరిగ్గా లేదనుకుంటా" తూలుతూ వెళ్ళిపోయాడు డాక్టర్ జాలయ్య ఎన స్థిస్ట్.

మేము గైనిక్ వార్డు నుండి మెడికల్ వార్డుకి పోతుండగా పెద్దగా విజిల్ వినిపించింది.

"ఇన్‌స్పెక్షన్ టీమ్ కార్లు గేటు దగ్గరకొచ్చిన ట్టుంది. వాళ్ళను రిసీవ్ చేసుకోవాలి డాక్టర్. పదండి" అంటూ నన్ను తొందర చేశాడు అటెం డర్. ఇట్లాంటి విషయాల్లో బాగా అనుభవం ఉన్న ట్లుంది. నేను గబగబా మెట్లు దిగి కింద హాల్లోకి వెళ్ళేసరికి ఇన్‌స్పెక్షన్ టీమ్‌కు సంబంధించిన కార్లు పోర్టికోలోకొచ్చాయి. ముందు కార్లోంచి ముగ్గురు, వెనుక కార్లోంచి ముగ్గురూ దిగారు. వారితో పాటు చివరగా సుమోకి సూటూ, బూటూ వేసినట్టున్న వస్తాదులాంటి మనిషి అతికష్టంగా దిగాడు. కాదు కాదు బయటికి లాగారు. గుండ్రాయికి కాళ్ళొచ్చి గునగున నడిచెన్ అన్న చందంగా ఆ టీమ్‌కు ముందుగా నడుస్తున్నాడతను. అతనే ఈ కాలేజీ ఓనర్ కమ్ ఛైర్మన్ అని చెప్పాడు నా అటెండర్.

పరిచయాలు, మర్యాదలు, మాటమంతి, టిఫిన్లు, టీలు అయిపోయినాక "లెటస్ స్టార్ట్ అవర్ వర్క్" అన్నాడు వాళ్ళలోని పొడుగ్గా ఉన్న బట్టతల మనిషి. అతనే ఇన్‌స్పెక్షన్ టీమ్ హెడ్డు.

"ఓ.కే." అంటూ భుజాలు ఎగరేసి కోటు సరిచే సుకుంటూ దారి చూపుతూ బయలుదేరాను. ఓ.పి. గదుల బయట ఇసుక వేస్తే రాలనట్టు జనం. బిజీబి జీగా అటూ ఇటూ తిరుగుతున్నారు సీతాకోకచిలుక ల్లాంటి సిస్టర్లు.

ముందుగా ఎముకలు, కీళ్ళ వార్డులోకి వెళ్ళాం. తెల్లటి దుప్పట్లు పరిచి నీటుగా ఉన్న బెడ్ల మీద పేషెంట్లు పడుకొని ఉన్నారు. అందరికి చేతికో, కాలికో, తలకో దేనికో ఒకదానికి తెల్లటి పట్టీలు కట్ట బడి ఉన్నాయి. కొత్తగా వేసిన రంగుల వాసన ఘాటుగా ఉంది.

ఇన్‌స్పెక్షన్ టీమ్ హ్యాపీ. వార్డులో ఉన్న డాక్టర్ పెంచలయ్య పుత్తూరు వైద్యంలో దిట్ట. ఏ ప్రశ్నలు అడిగినా తడుముకోకుండా చెప్పడానికి రెడీగా ఉన్నాడు గాని ఒక్క ప్రశ్న కూడా వేయలేదు.

"హి ఈజ్ డాక్టర్ పెంచలయ్య" అంటూ అతని బ్యాడ్జి చూసి నేనే పరిచయం చేశా ఇన్‌స్పెక్షన్ టీమ్‌కి.

"పెన్సిల్?" అన్నాడు టీమ్‌హెడ్డు అతని పేరు అర్థంగాక.. అతన్ని కిందికి పైకి చూస్తూ.

అక్కడున్న నర్సు యూనిఫాం జేబులో ఉన్న పెన్సిల్ తీసి ఇవ్వబోయాడు సుమో ఆ ఇన్‌స్పెక్షన్ హెడ్డుకి.

మధ్యలో నేనడ్డుపడి.. "మీరు పొరబడినట్టు న్నారు. వారడిగింది ఆ డాక్టర్ గారి పేరు... పెన్సిల్ కాదు" అంటూ వారిని సర్జరీ వార్డుకు తీసుకెళ్ళాను.

అక్కడ కొంతమంది పేషెంట్లకు సెలైన్‌బా టిల్స్ నడుస్తున్నాయి. ఒకతను "కడుపునొప్పి...క డుపుకొప్పి, ఎపెండెక్స్... ఎపెండెక్స్.." అంటూ బెడ్డుమీద ఎగిరెగిరి పడుతూ ఏడుస్తున్నాడు.



''సాయంత్రం సర్జరీకి పోస్ట్ చేశాం సార్! ఇన్‌స్పెక్షన్ అయిపోయిన తర్వాత ఆపరేషన్ చేస్తాం'' అని టీంహెడ్‌తో చెప్పి. ''ఓవర్ యాక్షన్ తగ్గించవయ్య లేకపోతే వాళ్లకి డౌట్ వస్తుంది ఆ పొట్టిగా ఉన్నాయన నిజంగానే సర్జన్ కోసేస్తాడు నీ పొట్ట'' అన్నాడు మెల్లిగా ఆ పేషెంట్‌తో. మంత్రం వేసినట్టు పడుకున్నాడు.

''వెరీ గుడ్'' అన్నాడు టీమ్ హెడ్డు.

తర్వాత గైనిక్ వార్డులోకెళ్లాం. ఇక్కడ కూడా ఒక్క బెడ్డు ఖాళీగా లేదు. వరండాతో సహా వార్డు ఫుల్!

ఇన్‌స్పెక్షన్ టీమ్ హ్యాపి.

''ఎన్ని సర్జరీలు చేస్తారు?'' అని అడిగాడు ఇన్‌స్పెక్షన్ హెడ్డు.

''15, 20పైనే చేస్తామండి'' అంది అక్కడున్న డాక్టరు విమల.

''నెలకి కాదు రోజుకెన్ని'' అన్నాడు టీ మ్‌లో ఉన్న బక్కపలుచటి వ్యక్తి.

''అదేంటండి నెలకొకసారి, సంవత్సరానికో సారి చేసేవాళ్లలాగా కనబడుతున్నామా? రోజు 'సేసేత్తామండి ముప్పియి ఆపరేషన్లు'' అంది స్టాఫ్ నర్సు బాలమ్మ.

''డెలవరీస్?'' అన్నాడు పక్కనున్న బక్కాయన.

''రోజుకి పది, పదిహేనుంటాయి'' చెప్పింది డాక్టర్ విమల... ''ఓ! మైగాడ్! బిగ్ మెటర్నిటీ సెంటర్!'' ఆశ్చర్యపోతూ అన్నాడు.

''ప్లెసెంటా...ఎలా డిస్పోజ్ చేస్తారు?'' అన్నాడు టీమ్‌లోని ఇంకొక వ్యక్తి. అతనికి గైనిక్ ఇంట్రెస్టులాగుంది గుచ్చిగుచ్చి అడుగుతున్నాడు. అతన్ని అక్కడ్నుంచి ఎంత త్వరగా బయటికి తీసుకెళ్తే అంత మంచిదన్నట్టు ''అవన్నీ ఆయాలు చూసుకుంటారు'' అని నేను చెప్పబోతుంటే-

''ఇక్కడ ప్లేస్‌మెంట్‌కి నో ప్రాబ్లమ్ సార్..! సాల రీస్ కూడా బాగానే ఇస్తాము'' అన్నాడు ఆయాసపడుతూ సూట్‌లో ఉన్న సుమో మహాశయుడు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. ''తెలియక పోతే తెలియనట్టు ఉండొచ్చుగదా! ప్రతి దాంట్లోనూ ఫింగరెడతాడు'' అని మనసులో తిట్టుకొని ''మీరు పొరుబడినట్లున్నారు సార్! ''ప్లెసెంటా' అంటే డెలివరీ అయిన తర్వాత బిడ్డతో పాటు వచ్చే మాయ'' అని చెప్పి...''మాయ ఏం చేస్తారు'' అని స్టాఫ్‌నర్సు బాలమ్మ వంక చూశాను అతన్ని తృప్తిపరచడానికి.

''ఓ అదా! దోసపాడు మాయావతేనా అయ్య గోరు! మాతో వత్తాననే బయల్దేరింది. తీరా గెద్దలపాడు మెడికల్ కాలేజీవాళ్ళు ఎక్కువ డబ్బిత్తానంటే అదటెల్లిపోయింది. దొంగసచ్చింది! చూశావా అది రాకపోతే అనవసరంగా మనకు మాటొచ్చింది'' అంటూ డాక్టర్ వేషంలో ఉన్న విమల వంక చూసింది స్టాఫ్‌నర్సు బాలమ్మ. నోరు మూసుకోమంటూ కోపంగా చూసింది డాక్టర్.

ఇంకాసేపు ఇక్కడుంటే ఏం కొంపలంటుకుంటాయోనని ''థియేటర్ చూద్దాం సార్!'' అన్నాను టీమ్ హెడ్డుతో.

''ఇక్కడ ఇన్‌స్పెక్షన్ పెట్టుకొని ఇప్పుడు సినిమాలేంటి డాక్టర్ గారు..రాత్తిరికి అవన్నీ..ఇప్పుడు ఈ ఇన్‌స్పెక్షన్ పని కానీయండి'' అన్నాడు సూట్‌లో ఉన్న సుమో నా వంక చిరాగ్గా చూస్తూ.

''థియేటరంటే..ఆప్రేషన్ థియేటర్ సార్'' అన్నాను కొంచెం మెల్లగా..కోపంగా..ఆయనకే వినబడేట్టుగా.

''అట్లయితే ఓ.కే. పదండి-ఆడ జాలయ్యాగాడినుండమన్నాలే'' అన్నాడు సుమో. మేమంతా ఊరేగింపుగా థియేటర్ దగ్గరకెళ్ళేసరికి అక్కడున్న జాలయ్య..సారీ..! డాక్టర్ జాలయ్యగారు దమ్ము కొడ్తున్నారు.

''ఓపెన్ ద థియేటర్'' అన్నాడు టీమ్ పెద్దాయన.

బీడీ ముక్క ఆర్పకుండా గోడకానిచ్చి- ''ఆపరేషన్ గది తాళాలు లేవు. ఏం షేయమంటారు?'' అని తలుపు తియ్యడానికి తెగ కష్టపడ్డాడు-తోశాడు..తన్నాడు..గుంజాడు..అయినా అవి తెరుచుకోలేదు.




''తలుపులు తీసి శానాకాలం అయ్యినట్టుంది.. షిలుం పట్టి బిగుసుకుపోయినియ్'' అంటూ వెకిలి నవ్వు నవ్వి- భుజంతో ఒక్క తోపు తోసేసరికి.. ఫెళ ఫెళమంటూ తలుపులు తెరుచుకున్నాయి.

ఆ శబ్దానికి ఆపరేషన్ గదిలోంచి రెండు పావురాలు రెక్కలు టపటపా కొట్టుకుంటూ ఎగిరి బయటకొస్తూ, వాటిలో ఒకటి టీమ్ హెడ్డు బట్టతల మీద రెట్ట వేసింది.

కోపంతో గింజుకుంటూ... ''వాటీజ్ దిస్ నాన్సెన్స్'' అంటూ తెగ చిరాకుపడ్డాడు టీమ్ హెడ్డు.

నా అటెండర్‌ని ఆ రెట్ట తుడిచెయ్యమన్నాను. అది నా డ్యూటీ కాదన్నట్టు నా వైపు కోపంగా చూస్తుంటే సుమోనే రుమాలుతో తుడిచేశాడు-బట్టతల రుద్దిరుద్ది తోలూడొచ్చేలా.

ఆపరేషన్ గదిలోకెళ్ళంగానే ఒకటే దుమ్ము..టీమ్‌లో ఉన్న బక్కాయనికి ఒకటే తుమ్ములు..ఆపరేషన్ టేబుల్ నిండా బెత్తెడు మందం దుమ్ము పేరుకొని ఉంది. లైట్లకు, గోడలకు సాలిగూడులు అల్లుకుని స్పైడర్లు కాలనీలు కట్టుకొని కాపురాలు చేస్తున్నాయి. ఇక అక్కడుండలేక బయటికొచ్చేశారు టీమ్.

బక్కాయన ఇంకా తుమ్ముతూనే ఉన్నాడు. టీమ్ హెడ్డు పావురం రెట్టకు ఇంకా ఇదైపోతూనే ఉన్నాడు. వాళ్ళను మాటల్లో పెట్టి..ఓ.పి.లకు తీసుకెళ్లాను.

డెర్మటాలజీలో ఉన్న డాక్టర్‌ను చూసి గుర్తుపట్టేశాడు...బక్కశాల్తీ.

''మిమ్మల్ని పోయినసారి ఇన్‌స్పెక్షన్ కొచ్చినప్పుడు హలో ఐ మీన్ ఆప్తాల్మాలజీలో చూసిన గుర్తు'' అన్నాడు పెద్దగా హచ్...హచ్.. అంటూ తుమ్మి.

''ఎస్ సార్! 'ఐ'నే డెర్మటాలజీ..చర్మవ్యాధి నిపుణిణి-దీంట్లో హెడ్డుని'' అన్నాడు ఓ.పి.లో ఉన్న డాక్టర్.

ఈలోపు హచ్...హచ్..అంటూ మళ్ళీ తుమ్మాడు బక్కశాల్తీ.

''ఆయనంటోంది అదికాదు డాక్టర్..మీరు పోయినసారి ఈ టీమ్ వచ్చినప్పుడు ఆఫ్తాల్మాలజీలోగాని ఉన్నారా?'' అని నేను చెప్పేలోగే- హచ్.. హచ్ అంటూ మళ్ళీ తుమ్మాడు బక్కాయన.

''ఓ హచ్ గురించా? నాది బిఎస్ఎన్ఎల్ సార్! కవరేజ్ బాగానే ఉందిప్పుడు'' కావాలా అన్నట్టు జేబుల్లోంచి సెల్ తీసిచ్చాడు.

''పిచ్చిమాలోకం! హచ్ వోడాఫోన్ అయిన సంగతి కూడా తెలీదు...వీల్లేం మనుషులో'' అన్నాడు నా అటెండర్.

అక్కడుంటే ఇంకా ఏం కొంపలంటుకుంటాయోనని పక్కనున్న చెవి, ముక్కు, గొంతు ఓ.పి.కి తీసుకొచ్చా టీమ్‌ని. ఓ.పి. బయట పది మంది దాకా బెంచీల మీద కూర్చున్నారు-లోనున్న పేషెంట్‌ని ఎగ్జామిషన్ టేబుల్ మీద పడుకోబెట్టి స్టెతస్కోప్‌తో ఎగ్జామిషన్ చేస్తున్నాడు అక్కడున్న డాక్టర్. అక్కడుండాల్సిన హెడ్‌మిర్రర్ గానీ, బుల్స్ ఐ లాంప్

గానీ లేవు.

''ఈజిట్ ఇ.ఎన్.టి. ఓ.పి.?'' డౌట్ వచ్చిన నాతో అన్నాడు టీమ్ హెడ్డు.

''వేరీస్ హిజ్ హెడ్‌మిర్రర్?'' అని పక్కనున్న బక్కాయన అడిగాడు నన్ను.

లోనికెళ్తే ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని అక్కడి నుంచి బయటికొస్తుంటే చిన్నపిల్ల ఓ.పి. ముందు ''రింగారింగా రోజెస్'' అంటూ ఆడుకుంటున్న యూనిఫాంలో స్కూల్ పిల్లల్ని చూసి ''హు ఆర్ దే?'' అన్నాడు టీమ్ హెడ్డు నవ్వుతూ.

''పేషెంట్స్ సార్'' చెప్పాడు తడుముకోకుండా మాతోపాటు వస్తున్న సుమో. ''ఓ దే ఆర్ వెరీ హెల్తీ!'' అన్నాడు హెడ్డు నవ్వుతూ.

ఆ పిల్లలు ఆడుకుంటున్న బంతి ఒకటి ఎగిరి మా టీమ్ కాళ్ళ సందులోంచి ఆడియోమెట్రి గదిలోకెళ్ళింది- ఒక పిల్ల వచ్చి బంతి తీసుకెళ్తూ ''ఎక్స్‌క్యూజ్‌మి'' అంది అడ్డంగా ఉన్న మమ్మల్ని.

''వాటీజ్ యువర్ నేమ్?'' అడిగాడు టీమ్ పెద్దాయన ఆ పిల్లని.

''మై నేమ్ ఈజ్ ఎస్.అనూజ, సెవెంత్ సి సెక్షన్, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్'' అని చెప్పి చిన్నపిల్లల ఓ.పి. వద్దకు పరుగెత్తింది.

''పిడియాట్రిక్స్ (చిన్నపిల్లల) ఓ.పి. చూద్దామా సార్!'' అన్నాను.

''నాట్ నెసెసరీ'' అంటూ ఆఫీసు గదివైపు కదిలింది టీమ్.

అప్పటికే అక్కడ చికెన్ బిర్యానీ, మటన్ మసాలాలతో ఘుమఘుమలాడిపోతోంది. మేడమ్ లంచ్ ఏర్పాట్లలో బిజీగా ఉంది. శత్రువుల మీద దూకే జవాన్లలాగా వాళ్లంతా పుడ్డు మీద పడ్డారు.

ఉత్తర భారతదేశం వాళ్ళు రొట్టెలే తింటారనుకొంటే బిర్యానీ, రైస్, రొట్టెలు, సాంబారు అన్న తేడా లేకుండా చెడుగుడు ఆడించేశారు. మేడమ్ అందరికీ కొసరి కొసరి వడ్డించింది. ఇన్‌స్పెక్షన్‌లో కొన్ని డిపార్ట్‌మెంట్లు వదిలేసినా పుడ్డు విషయంలో మాత్రం ఏ ఒక్క ఐటమ్ వదలకుండా పీకలదాకా మెక్కారు. వాళ్లు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన తర్వాత సిన్సియర్‌గా పనిచేయడం నేనిప్పుడే చూశా. పాన్‌లు నములుతున్న వారితో ''రెస్ట్ ఏమన్నా తీసుకుంటారా సార్'' అని అడిగా-ఇంత తిని ఏం కదుల్తారులే అనుకొని.

''నో..నో..నో..దేరీజ్ అనదర్ ఇన్‌స్పెక్షన్ టుమారో. యునో వాటీజ్‌దట్?'' అన్నాడు పక్కనున్న బక్కశాల్తీతో టీమ్‌హెడ్డు.

''గెద్దెలపాడు'' అన్నాడు బక్కాయన కిళ్ళీ తుపుక్కున పూలకుండీలో ఊస్తూ.

ఆ తర్వాత వాళ్ళంతా నాకు షేక్‌హ్యాండ్లిచ్చి నా చేతులు పిసికి పిసికి సెలవు తీసుకున్నారు. వాళ్ళొచ్చిన రెండు క్వాలీస్‌లు వెళ్ళిపోయాయి. వారితో పాటే సూట్‌లో ఉన్న సుమో కూడా వెళ్ళిపోయాడు.

నన్ను తీసుకువచ్చిన డ్రైవర్ కనబడలేదు. ఈలోపు ఓచర్ల మీద సంతకం చేసి డబ్బులు తీసుకుందామని ఆఫీసు గదికెళ్ళా. అక్కడ మేడమ్ ఆఫీసు స్టాఫ్‌తో లంచ్ చేస్తోంది. ఇన్‌స్పెక్షన్ బాగా జరిగినందుకు హ్యాపీగా ఉన్నట్టుంది.

''బాగా చేశారు సూపరింటెండెంట్‌గా..నెక్స్ట్ ఇయర్ ఇన్స్‌పెక్షన్‌కు కూడా మిమ్మల్నే పిలుస్తాం డాక్టర్'' అంది.

''నేనొక్కన్నేనా..మనమంతా..ఆమాత్రం చేయకపోతే మన మెడికల్ కాలేజీకి పర్మిషన్ ఎలా వస్తుంది చెప్పండి'' అని ఫోజు పెట్టి..క్యాషియర్ కోసం వెదకసాగాను.

***

ఇంతలో అటెండర్ రామయ్య పరుగెత్తుకుంటూ వచ్చి- ''మేడమ్ గారు... మేడమ్ గారు... ఆ ఇన్‌స్పెక్షన్ టీమ్‌లో ఉన్న బక్కటాయన మళ్ళీ తిరిగివచ్చాడు ఆయన సెల్‌ఫోన్ ఇక్కడెక్కడో మరిచిపోయాడంటా'' అని చెబుతుండగా హచ్.. హచ్..అని తుమ్ములు వినబడ్డాయి.

''వాట్ హ్యాప్పెండ్ సార్? ఆర్ యు ఆల్‌రైట్... ఎనీ ప్రాబ్లమ్?'' అన్నాను.

''ఇట్స్ ఓ.కే. ఐ లాస్ట్ మై సెల్ హియర్ సమ్‌వేర్'' అంటూ ఓ.పి.ల వెంట పడ్డాడు. ఇప్పుడు ఇతను ఓ.పి.లకు, వార్డులకి వెళ్తే నాటకమంతా బయటపడుతుంది. ఇప్పుడెలా రా దేవుడోయ్...! క్రైసిస్ మేనేజ్‌మెంట్ గురించి ఆలోచిస్తూ ఆయన వెంటే పరిగెత్తాను. ఒక్క పేషెంటూ లేడు. కారిడార్లన్నీ ఖాళీ, ఓ.పి. గదులన్నీ తాళాలేసి ఉన్నాయి. వార్డుల వైపు బయల్దేరాడు. గైనిక్, సర్జరీ, పిడియాట్రిక్స్, మెడికల్ వార్డులన్నీ తాళాలేసి ఉన్నాయి. వాటి తలుపులు తీయించి మరీ వెదికాడు. ఒక్క పేషెంట్ ఉంటే ఒట్టు...అక్కడుండాల్సిన సిస్టర్లు, డాక్టర్లూ తుపాకిగుండుకి దొరక్క ఎప్పుడో పారిపోయారు. హాస్పిటల్ అంతా ఖాళీ..ఓ.పి.లన్నీ ఖాళీ..! వార్డులన్నీ ఖాళీ!!

పేషెంట్స్ ఎక్కడని ఆయన అడిగితే ఏం చెప్పాలా అని ఆలోచించుకుంటూ ఆదోరకంగా మొహం పెట్టి ఆయన వెనకాల హాస్పిటల్ అంతా తిరిగా.

ఆయన సెల్ ఎక్కడా కనబడలేదు. నిరాశగా కారు దగ్గరకి వచ్చి హచ్...హచ్..అని మళ్ళీ తుమ్మాడు.

''హాస్పిటల్‌లో ఒక్క పేషెంట్ లేరని ఈయన వెళ్ళి మన నాటకమంతా టీమ్‌హెడ్డుతో చెబుతాడేమో.. ఈసారి కూడా పర్మిషన్ రాదేమో మేడమ్'' అంటూ గొణుగుతున్నాడు మేడమ్‌గారి పి.ఎ.పి.కె. రావు బక్కాయన వంక గుర్రుగా చూస్తూ.

ఇంతలో ''ఏ కైకే పాన్ బనారసు వాలా'' అనే రింగ్‌టోన్ వినిపించింది.

అందరం ఎక్కడ్నుంచా సౌండని చూశాం. అది నా సెల్ కాదు..మేడమ్‌ది కాదు...అటెండర్‌ది కాదు...మరెవరిది?

ఆ బక్కశాల్తీనే తన ప్యాంటు జేబులో చేయి పెట్టి బయటకు తీసి ''హో...ఇటీజ్ ఇన్ మై పాకెట్'' అంటూ వెకిలిగా నవ్వాడు.

''సెల్ పోయిందనే వంకతో తిరిగొచ్చి మా బండారం పసిగట్టావురా బక్కవెధవా''ని తిట్టుకుంటూ- ''చూశారా! సంకలో పిల్లను పెట్టుకొని ఊరంతా వెదికినట్టు...ఆ సెల్ మీ జేబులోనే ఉంది'' అంది మేడమ్ నవ్వు, ఏడుపు కలిసిన మొహంతో.

''ఓ..ఎస్..ఎస్..ఇటీజ్ ఇన్ మై పాకెట్!'' అన్నాడు ఆశ్చర్యం నటించి వంకరగా నవ్వుతూ కారెక్కాడు బక్కశాల్తీ.

నాకు రావాల్సిన డబ్బులు తీసుకొని బయటకొస్తుంటే- ''ఇది హాస్పిటల్ యాప్రానండీ'' అంటూ వంటి మీద ఉన్న తెల్లకోటు లాగేసుకున్నాడు అటెండర్.

''మరీ...! నేను తెచ్చిన యాప్రానేదయ్యా'' అన్నాను.

''రంగులేసేవాళ్ళు తీసుకున్నారు...పోయి తీసుకోండి'' అన్నాడు.

మల్లెపువ్వులాంటి నా యాప్రాన్‌తో రంగులేసిన బ్రష్‌లు తుడుచుకున్నట్లున్నారు...దానిమీద రకరకాల రంగులు, మరకలు పడ్డాయి. దాని అసలు రంగే మారిపోయింది.

★

